క్లుప్తంగా

ఫస్ట్ ర్యాంక్ విద్యార్థినికి చెక్కు అందజేత

మంచిర్యాలటౌన్: మందమర్రిలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థిని హరిత ఎంపీసీ మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించినందుకు, జిల్లా కేంద్రంలోని రామునిచెరువు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.53,016 చెక్కును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీరాముల వెంకటేష్–రాజేశ్వరీ, దంపతుల కూతురైన హరితకు ఆర్థికంగా ఆదుకోవాలని సభ్యులందరు కలిసి కొంత సాయం అందించినట్లు తెలిపారు.

కోదండ రామాలయం కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్

బెల్లంపల్లి: స్థానిక శ్రీ కోదండ రామాలయం కమిటీ చైర్మన్‌గా రేణికుంట్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఏఎంసీ ఏరియా క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దేవాదాయ, ధర్మాదాయ శాఖ జారీ చేసిన నియామక పత్రాన్ని అందజేసి, శాలువా కప్పి సన్మానించారు.

విద్యుదాఘాతంతో వరి దగ్ధం

జైపూర్: మండలంలోని కిష్టాపూర్ గ్రామం రాజమల్లుకు చెందిన నాలుగు ఎకరాల వరిపంట ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పూర్తిగా దగ్ధమైంది. వరిపంట సమీపంలో విద్యుత్ లైన్ ఉండగా, తీగల రాపిడికి మిరుగురవ్వలు పొలంపై పడడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పొలం అంతా వ్యాపించాయి. ప్రభుత్వం పరంగా నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ప్రవేశం కోసం పదో తరగతి పాసైన విద్యార్థుల నుంచి మొదటి దఫా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ దేవానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రిలోని ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డిజిల్ మెకానిక్, డ్రాఫ్ట్ మ్యాన్ సివిల్, కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రతిపాదికన ఎంపిక ఉంటుందని, ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తున్నప్పుడు పదో తరగతి మార్కుల మెమో ఆధారంగా తప్పులు దొర్లకుండా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ఈ నెల 25, 26న దివ్యాంగుల బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. బాలాజీ చెస్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత పాస్‌లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సదరం సర్టిఫికెట్, ఫొటో, ఆధార్‌కార్డు, తీసుకుని ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

నేడు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రాక

రామకృష్ణాపూర్: రాష్ట్ర ఎక్సైజ్, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం క్యాతనపల్లి మున్సిపాలిటీలో పర్యటించనున్నారు. స్థానిక శ్రీనివాసగార్డెన్స్‌లో సాయంత్రం 4గంటలకు గెజిటెడ్, నాన్‌గెజిటెడ్, రెవెన్యూ, సింగరేణి అధికారులతో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో 5గంటలకు ఎస్వీఆర్ గార్డెన్స్‌లో గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొననున్నారు. అనంతరం 6గంటలకు రామాలయం చౌరస్తాలో 6వ విడత సింగరేణి ఇళ్ల పట్టాల పంపిణీ, 7గంటలకు సీఎం కప్ జిల్లా పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొననున్నారు. మంత్రితో పాటు ప్రభుత్వ విప్ బాల్కసుమన్, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లపై బెల్లంపల్లి ఏసీపీ సదయ్య ఆరా తీశారు. మంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు.

బెల్లంపల్లి విద్యార్థి హైదరాబాద్‌లో అదృశ్యం

బెల్లంపల్లి: హైదరాబాద్‌లో బెల్లంపల్లికి చెందిన ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన మంగళవారం వెలుగు చూసింది. పట్టణంలోని బజారు ఏరియాకు చెందిన వ్యాపారి మంగీలాల్ జవార్ కుమారుడు తరుణ్ జవార్ హైదరాబాద్ ఆగాపూరా పాన్ మండి ప్రాంతంలో నివాసం ఉంటున్న తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి చదువుకుంటున్నాడు. కో–ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తరుణ్ జవార్ ఉదయం 7:30గంటల ప్రాంతంలో ర్యాపిడో బైక్ బుక్ చేసుకుని కళాశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. సెల్‌ఫోన్ కూడా వెంట తీసుకెళ్లలేదు. కళాశాలకు కూడా వెళ్లలేదు. సాయంత్రం గడిచినా ఇంటికి రాకపోవడంతో తరుణ్ జవార్ అమ్మమ్మ ఆ సమాచారాన్ని తండ్రి మంగీలాల్ జవార్‌కు తెలియజేసింది. సమాచారం అందుకున్న తండ్రి బెల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లాడు. తరుణ్ జవార్ అదృశ్యం కావడానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటన బెల్లంపల్లిలో కలకలం రేపింది.

మూగజీవాల మృత్యుఘోష!

- రెండు నెలల్లో వెయ్యికిపైగా పందులు మృతి
- వీధికుక్కలూ మృత్యువాత
- పట్టించుకోని బల్దియా అధికారులు



ఈ ఫొటోలో మృతి చెందిన పందితో కనిపిస్తున్న వ్యక్తి పేరు శ్రీరాముల రమేష్. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని బూడిద గడ్డబస్తీ. అతడికి 100కు పైగా పందులు ఉండగా, ప్రస్తుతం ఏదో వింత వ్యాధితో రెండు నెలల్లో 80వరకు మృతి చెందాయి. జీవనాధారమైన పందులు మృతి చెందడంతో రమేష్‌కు తీవ్ర ఆర్థికనష్టం కలిగింది. అప్పులు చేసి పందులు కొన్న తనకు, తిరిగి అప్పులే మిగిలాయని ఆవేదన చెందుతున్నాడు.



చనిపోయిన పందులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో రోజువారీగా విచ్చలవిడిగా పందులు మృత్యువాత పడుతున్నాయి. ఉదయం వీధుల్లో సంచారిస్తూ కనిపిస్తున్న పందులు తెల్లారేసరికి విగతజీవిగా పడి ఉంటున్నాయి. గడిచిన రెండు నెలల కాలం నుంచి పందులు, పక్షం రోజుల నుంచి వీధి కుక్కలు సైతం మృతి చెందుతున్నట్లు పురప్రజలు చెబుతున్నారు. ఇళ్ల పరిసరాల్లో, వీధుల్లో, మురికినీటి కాలువల్లో ఇబ్బడి ముబ్బడిగా పందులు మృతిచెంది కనిపిస్తుండటంతో పురప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఆకస్మికంగా పందులు చనిపోతుండటానికి గల కారణాలు తెలియక పెంపకందారులు వేదనకు గురవుతుండగా, గడిచిన రెండు నెలల వ్యవధిలో వెయ్యికి పైగా పందులు మృతిచెంది యజమానులు రూ.అరకోటి వరకు నష్టపోయినట్లు వాపోతున్నారు. నెలలు గడుస్తున్నా పందుల మృత్యుఘోష పరంపర ఆగకపోవడంతో మరింతగా నష్టం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వార్డుల్లో పందుల పెంపకం..

మున్సిపాలిటీలో ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు కులవృత్తిని వీడి పందుల పెంపకాన్ని జీవనాధారంగా ఎంచుకున్నారు. ఒక్కో వార్డు పరిధిలో ఒక్కొక్కరుగా పందుల పెంపకాన్ని వృత్తిగా చేపట్టారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా 10వేలకు పై బడి పందులు ఉన్నట్లు యాజమానులు చెబుతున్నారు. పిల్లలను వేరే ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చి పెంచుతూ, బెంగుళూరు, ఇతర ప్రాంతాలకు ప్రత్యేక వాహనాల్లో రవాణా చేసి అమ్మకాలు చేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. పందులే ఏకైక ఆధారంగా ఉన్న యజమానులు ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితులను చవిచూస్తున్నారు. ఆకస్మిక మరణాలతో జీవనాధారం లేకుండా పోతోందని, ఆర్థికంగా ఎంతగానో నష్టపోతున్నామని కన్నీటి పర్యంతమవుతున్నారు.

మరణాలకు కారణమేంటో..?

ఏళ్ల నుంచి ఇప్పటివరకు ఏ ఒక్కనాడు కూడా పందులు వరుసగా మృతి చెందిన ఘటనలు చోటు చేసుకోలేదు. రెండు మాసాల నుంచి రోజువారీగా పందులు మృత్యువాత పడుతున్నాయి. వీధి కుక్కలు కూడా చనిపోతుండటం గమనార్హం. మృతి చెందుతున్న పందులు, కుక్కల వల్ల తమకేదైన ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయోమోనని పురప్రజలు భయపడుతున్నారు.

పట్టించుకోకపోతే ప్రమాదమే..!

జంతువుల ద్వారా మనుషులకు సైతం వ్యాధులు సంక్రమించే వీలుందని పశువైద్యాధికారులు చెబుతుండగా అంతటి సమస్యను మున్సిపల్ అధికారులు గాలికొదిలేసి తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడాన్ని పురప్రజలు తప్పుపడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకుంట లేరు..



రెండునెల్ల సంది పందులు దినాం ఐదారు చనిపోతున్నయ్. పందులకు ఏమైందో ఏమో తెలుస్తలేదు. చనిపోతున్న పందులను మున్సిపాల్టోళ్లకు చెప్పి ఇండ్లకు దూరంగా పడేయమని చెప్తన్నం. మాకెలాంటి ఆస్తిపాస్తులు లేవ్. పందులే మా ఆస్తులు. ఆటిని నమ్ముకునే బతుకున్నం. సార్లు ఇసారం జేసి పందుల ప్రాణాలు పోకుండా కాపాడాలే. డాక్టర్లకు చెప్పి పందులను పరీక్షించాలే. మాకు జరిగిన నష్టానికి సర్కారు ఆర్థికసాయం జేసి ఆదుకోవాలే.

– మధునమ్మ, పందుల యజమానురాలు, బెల్లంపల్లి

సన్‌స్ట్రోక్, ఫుడ్ పాయిజన్‌తో చనిపోతున్నాయేమో?

మున్సిపాలిటీలో పందులు, కుక్కలు చనిపోతున్న విషయాన్ని ఇప్పటివరకు ఎవరు కూడా మా దృష్టికి తీసుకురాలేదు. ఆకస్మికంగా జీవాలు మృతి చెందడానికి సన్‌స్ట్రోక్ అయిన వచ్చి ఉండాలి లేదా ఫుడ్ పాయిజన్ అయిన జరగాలి. ప్రస్తుతం ఎండలు రోజువారీగా గరిష్ట స్థాయిలో నమోదు అవుతుండటంతో సన్‌స్ట్రోక్ వచ్చి ఉంటుందేమోననే అనుమానాలు కలుగుతున్నాయి. మృతి చెందిన పందిని పీఎంఈ చేస్తేకానీ మరణానికి గల కారణం తెలియదు. చనిపోయిన వెంటనే పోస్టుమార్టం చేస్తే నిర్ధారణ జరగడానికి అవకాశాలు అధికంగా ఉంటాయి. గంటల తర్వాత పోస్టుమార్టం చేస్తే ప్రయోజనం ఉండదు.

– డాక్టర్ సుజాత, పశువైద్యాధికారిణి, ఆకెనపల్లి

రోడ్డుపై మురుగునీరు..! — అటెన్షన్ ప్లీజ్..



భీమారం: మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి లంబాడితాండకు వెళ్లే ప్రధాన రహదారిలోని మురుగుకాలువలు శుభ్రపర్చక పోవడంతో చెత్తాచెదారం, మట్టి చేరి అధ్వానంగా ఉన్నాయి. పూడికతో నిండి పోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని మురుగుకాలువలు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి : శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఫోన్ నంబర్ : 8555898819

పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

లక్సెట్టిపేట: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయని, ఈ నెల 22న 'సాక్షి' దినపత్రికలో 'పిచ్చిమొక్కలు తొలగించండి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పిచ్చిమొక్కలు తొలగించి విద్యుత్ శాఖ అధికారులు చెత్తను శుభ్రం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ శుభ్రంగా చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

అభివృద్ధి పనుల పరిశీలన

వేమనపల్లి: మండలంలోని ముల్కలపేటలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతున్న జంపాల రాజన్నను పరామర్శించి వైద్య ఖర్చులకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దస్నాపూర్ గ్రామంలో శ్రీ భక్తాంజనేయ సహిత శివపంచాయతన సుబ్రహ్మణ్య ధ్వజశిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు శ్రీరాంభట్ల కార్తీక్‌శర్మ ఆధ్వర్యంలో జలాదివాసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వేణుమాదవ్, సర్పంచ్‌లు రాజలింగు, రాజేశ్వరి, మధుకర్, బాపు, ఏఎంసీ వైస్ చైర్మన్ లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిన్నయ్య

నేడు ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో బుధవారం సాయంత్రం 4గంటలకు ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ హాజరు కానుండగా, జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ఉద్యోగ జేఏసీ చైర్మన్ మామిళ్ల రాజేందర్, సెక్రటరీ మమత, మారం జగదీశ్, సత్యనారాయణ హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక జేఏసీలు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాల అమలు

- ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్: పేదల అభ్యున్నతికే రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని తాళ్లపల్లి ఆర్ అండ్‌ఆర్ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. కాలనీలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. డ్రైయినేజీ వ్యవస్థను పరిశీలించారు. పలు సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకురాగా సింగరేణి, మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్లు ప్రకాశ్‌రెడ్డి, మర్రి రాజమౌళి, బౌతు లక్ష్మి, పూదరి కుమార్, అన్నపూర్ణ, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

రాచర్లలో 'కమ్యూనిటీ కాంటాక్ట్'

వేమనపల్లి: అనుమానిత, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని చెన్నూర్‌రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని రాచర్ల గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని రెండు బైక్‌లు, ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, గ్రామంలో కొత్త వ్యక్తులు, నేరస్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చెడు అలవాట్లకు యువత బానిస కావొద్దన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు సుబ్బారావు, వెంకట్, పోలీసులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

డంపింగ్‌యార్డు మార్చాలని వినతి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని అండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డును మార్చాలని ఆమ్ఆద్మీపార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ నయాం పాషా, ఆ పార్టీ సీనియర్ నాయకులు నల్ల నాగేంద్రప్రసాద్ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి మంగళవారం మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆప్ పార్టీ నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బొగ్గుబాయి వార్తలు

నీటిని పొదుపుగా వాడుకోవాలి

శ్రీరాంపూర్: పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆర్కే న్యూటెక్ గనిపై నీటి పొదుపుపై గని మేనేజర్ స్వామిరాజు అవగాహన కల్పించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా ఇంకుడుగుంతలతో ఒడిసి పట్టాలన్నారు. భావితరాలకు మంచి భవిష్యత్ ఉండాలంటే, భూగర్భ జలాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని సూచించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కొట్టె రమేశ్, పిట్ సెక్రెటరీ జంపయ్య, నాయకులు బుస్స రమేష్, సంక్షేమ అధికారి పాల్‌స్రుజన్, పిట్ ఇంజనీర్ రాజగోపాలచారి, ఇంజనీర్ కృష్ణ, వెంటిలేషన్ అధికారి శంకర్ పాల్గొన్నారు.

జీఎంను కలిసిన ఎస్సీ, ఎస్టీ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్(1630/1982) సెంట్రల్ నాయకులు శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని కలిశారు. అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరెపల్లి రాంచందర్, ఉపాధ్యక్షుడు ఆరెపల్లి రాంచందర్, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ దామెర ప్రవీణ్‌కుమార్ మంగళవారం జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డిని కలిసి సమస్యలపై చర్చించారు. ఆర్‌ఓఆర్‌ను పక్కాగా అమలు చేయాలని కోరారు. బ్యాగ్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం జీఎం కార్యలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు నెలబోయిన కుమార్, ఏరియా కార్యదర్శి కంబాల నాగయ్య, చీఫ్ ఆర్గనైజర్ చెన్నూరి శ్రీనివాస్ అన్ని గనుల పిట్ సెక్రెటరీలు, బ్రాంచీ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం

దండేపల్లి: పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరుగుతుందని ఏడీఏ అనిత అన్నారు. దండేపల్లి సహకార సంఘం వద్ద ఎంపీపీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్నతో కలిసి మంగళవారం పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు వరిసాగుకు ముందు తొలకరి వర్షాలకు జీలుగా, జనుము విత్తనాలు పొలంలో చల్లితే అవి ఏపుగా పెరిగిన తర్వాత పొలంలో కలియదున్నాలన్నారు. ఆ తరువాత వరినాటు వేసుకుంటే మంచిదన్నారు. పచ్చిరొట్టతో మంచి భూసారం పెరుగుతుందన్నారు. ఎంపీటీసీ శ్రీనివాస్, ఏవో అంజిత్‌కుమార్, ఏఈవో రజిత, పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ, ఎంపీపీ

'రైతులు రశీదు తీసుకోవాలి'

కాసిపేట: రైతులు ఎరువులు, విత్తనాలు తీసుకునేటప్పుడు తప్పకుండా రశీదులు తీసుకోవాలని బెల్లంపల్లి ఏడీఏ సురేఖ సూచించారు. మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతువేదికలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పచ్చిరొట్ట ఎరువులు వాడడం వల్ల కలిగే లాభాలు, సేంద్రియ వ్యవసాయం, వేసవి దుక్కుల ఉపయోగాలు, భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి వివరించారు. మల్కేపల్లి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు నాణ్యత ప్రమాణాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంఏవో వందన, ఏఈవోలు దివ్య, అంజలి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

లక్సెట్టిపేట: పట్టణంలోని విత్తన దుకాణాల్లో కరీంనగర్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల స్టాక్ రిజిస్టర్, పీసీలు తనిఖీ చేశారు. గోదాంలలో నిలువ ఉంచిన పురుగుల మందులు, విత్తనాలను, ఎరువులను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో కరీంనగర్ విజిలెన్స్ సీఐ వరుణ్‌ప్రసాద్, దినేశ్‌కుమార్, ఏవో ప్రభాకర్ తదితరులున్నారు.

వ్యవసాయ సమాచారం

'నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు'



చెన్నూర్: చెన్నూర్ పరిధిలోని ఫర్టిలైజర్ డీలర్లు నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ వాసుదేవరావు అన్నారు. పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల షాపులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సై మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కాసిపేట: ఎమ్మెల్యే చిన్నయ్యపై హైదరాబాద్‌లో ఫ్లెక్సీలు పెట్టి మనస్థాపానికి గురిచేసిన ఆరిజిన్ డెయిరీ డైరెక్టర్ ఆదినారాయణ, శేజల్‌లపై చర్యలు తీసుకోవాలని మంగళవారం నేతకానీ సంఘం ఆధ్వర్యంలో దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

బెల్లంపల్లి: కొత్తగూడెంలో జూన్ 4న జరిగే ప్రజాగర్జన పోస్టర్‌ను మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ శ్రేణులు ఆవిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

కొత్తపల్లిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీలో మంగళవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించగా ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. నర్సరీ, క్రిమటోరియం, డంపింగ్ యార్డులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, కార్యదర్శి లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం

వేమనపల్లి: మండలంలోని కళ్లంపల్లి, ముక్కిడిగూడం, జాజులపేట గ్రామాల్లో మంగళవారం వైద్యాధికారి రాజేష్ సూచన మేరకు హెల్త్ అసిస్టెంట్ లింగన్న వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి రక్తనమూనాలు సేకరించి మందులు అందజేశారు.

క్రీడాకారుడికి సన్మానం

నస్పూర్: ఇటీవల రష్యాలో జరిగిన అంతర్జాతీయ ఉషూ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచిన సీసీసీకి చెందిన శివమహేశ్‌ను మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య సన్మానించారు.

'సద్వినియోగం చేసుకోవాలి'

బెల్లంపల్లిరూరల్: మహిళల సంపూర్ణ ఆరోగ్య కోసం చేపడుతున్న ఆరోగ్య మహిళా క్లినిక్ వైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఎవంజలీన్ అన్నారు. తాళ్లగురిజాల పీహెచ్‌సీలో మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.